సాక్షి శ్రీకాకుళం

గురువారం । 25 । మే । 2023



సంబరం ఆరంభం

పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ప్రధాన సంబరం బుధవారం ప్రారంభమైంది. వేషధారణలు అలరించాయి. - 8లో



గాలివాన బీభత్సం

జిల్లాలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలుప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	37°	26°
ఇచ్ఛాపురం	37°	27°
పాతపట్నం	38°	27°
శ్రీకాకుళం	38°	26°

న్యూస్‌రీల్

గనులశాఖ ఏడీ పోస్టు ఎత్తివేత

అరసవల్లి: జిల్లాల విభజన అనంతరం జరిగిన మార్పుల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఇంతవరకు ఉన్న గనుల శాఖ సహాయ సంచాలకులు(ఎ.డి) పోస్టును ఎత్తివేసి.. ఇక్కడే ఉన్న డిప్యూటీ డైరెక్టర్ పోస్టును జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారిగా మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1 నుంచే ఉత్తర్వు నంబర్ 2 అమల్లోకి వచ్చినట్లు జిల్లా అధికారి ఎస్.కె.వి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. ప్రస్తుతం రామలక్ష్మణ కూడలి సమీపంలో ఉన్న డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయే ఇప్పుడు జిల్లా గనుల శాఖ కార్యాలయంగా మారిందని, ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

సజావుగా ఐసెట్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ఆన్‌లైన్ విధానంలో ఐసెట్ – 2023 (ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించిన ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షలు బుధవారం సజావుగా ముగిశాయి. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 165 మంది, రెండో షిఫ్టులో 172 మంది, టెక్కలి ఐతం కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 181 మంది, రెండో షిఫ్టులో 179 మంది, ఎచ్చెర్ల వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 173 మంది, రెండో షిఫ్టులో 167 మంది హాజరయ్యారు. మొత్తం 1147 మందికి 110 మంది గైర్హాజరయ్యారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయంలో బుధవారం రాత్రి రైలు కింద పడి వ్యక్తి మృతి చెందాడు. బరంపురం నుంచి పలాస వైపు వెళ్లే అప్ ట్రాక్‌లో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద తలపెట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. రాత్రి సమయం కావడంతో మృతుడి వివరాలు తెలియలేదు. 45 నుంచి 50 ఏళ్ల వయసు కలిగి తెల్లచొక్కా, గల్ల లుంగీ ధరించి ఉన్నాడు. రైల్వే పోలీసులు విచారణ చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు



కేసుల వివరాలపై ఆరా తీస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: నేర నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ జి.ఆర్.రాధిక సిబ్బందిని ఆదేశించారు. బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా శ్రీకాకుళం ఒకటో పట్టణ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ సందర్శించారు. గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసుల్లో రికార్డులను పరిశీలించారు. ముఖ్య కేసులపై సీఐ లెంక సన్యాసినాయుడును అడిగి తెలుసుకున్నారు. సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను గుర్తించాలని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీ పటిష్టం చేయాలన్నారు. ముఖ్య కూడళ్లు, దుకాణ సముదాయాలు, బ్యాంకులు, దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తూ అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వై.శృతి, ఎస్పీ సీసీ శివకుమార్ ఉన్నారు.

అక్రమ రవాణా అరికట్టాలి



మాట్లాడుతున్న లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు

కాశీబుగ్గ: రైళ్లలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని లైన్ ఇన్‌స్పెక్టర్(విశాఖ) వెంకటరావు సిబ్బందిని ఆదేశించారు. పలాస రైల్వేస్టేషన్‌లోని జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. గంజాయి, నల్లమందు రవాణా చేసే వారిని పట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్, సిబ్బంది కోదండరావు, నవీన్, అనిత, తేజ, లోకనాథం పాల్గొన్నారు.

రైళ్ల ఆలస్యంతో ఇక్కట్లు



పలాస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

కాశీబుగ్గ : జిల్లా మీదుగా ప్రయాణిస్తున్న పలు రైళ్లు ఆలస్యంగా రాకపోకలు సాగుతున్నాయి. ముఖ్యంగా విశాఖ, బరంపురం మధ్య నడిచే రైళ్లలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. బుధవారం డిబ్రుఘర్, అగర్తలా హమ్‌సఫర్, హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి–పూరి, విశాఖ ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి, బ్రహ్మపూర్ ఇంటర్‌సిటీ, కోణార్క్, పాట్నా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నీ గంట నుంచి రెండున్నర గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయమై రైల్వే ఉన్నతాధికారులు మాట్లాడుతూ రైల్వేట్రాక్ విస్తరణ, మరమ్మతుల నేపథ్యంలో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని చెప్పారు.



● కారుమబ్బులు కమ్మేసిన వేళ..

రోజంతా ఎండవేడి, ఉక్కపోతగా ఉన్న వాతావరణం బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై కారుమబ్బులు కమ్మేయడంతో పగటిపూటే చిమ్మచీకట్లు అలముకున్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు శ్రీకాకుళం నగరవాసులను భయభ్రాంతులకు గురిచేశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

● రైతుల భూములకు

రెట్టింపు సపోర్టు..!



మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు అప్రోచ్ రోడ్డు కోసం టెక్కలి సమీపంలో గుర్తించిన భూములు

- కొలిక్కివచ్చిన మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు రోడ్డు ప్రభావిత భూముల ధరలు
- ఇప్పడున్న ధరల కంటే అధికంగా చెల్లించేందుకు చర్యలు
- రోడ్డు కోసం 245.095 ఎకరాల భూములు గుర్తింపు



టెక్కలి: వెనుకబడిన సిక్కోలును అభివృద్ధి పరంగా అగ్రస్థానంలో నిలపడంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతబొమ్మాళి మండలం మూలపేట ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే శంకుస్థాపన పూర్తయిన ఈ పోర్టుకు సంబంధించి ఓవైపు ప్రభావిత గ్రామాల్లో నిర్వాసితులకు పరిహారం ప్రక్రియ వేగవంతం చేస్తూ.. మరోవైపు పోర్టు నిర్మాణానికి వడివడిగా చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా టెక్కలి జాతీయ రహదారి నుంచి మూలపేట పోర్టు వరకు ప్రత్యేకంగా విశాలమైన రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఆయా ప్రాంతాల్లో భూములను గుర్తించి వాటికి ఆమోదయోగ్యంగా ధరలను నిర్ధారించారు. పోర్టు అప్రోచ్ రోడ్డు కోసం మొత్తం 245.095 ఎకరాలను గుర్తించారు. అంతేకాకుండా పోర్టు రోడ్డు ప్రభావిత భూములకు ప్రాథమికంగా ఉన్న విలువ కంటే అధికంగా విలువను నిర్ధారించి ప్రభావిత రైతులకు న్యాయపరంగా పరిహారం అందజేసేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో బన్నువాడ, మోదుగువలస, తలగాం, వేములవాడ, పాతనౌపడ, ఇజ్జువరం, **రాజ**పురం, కస్పానౌపడ ప్రాంతాల్లో రోడ్డు ప్ర**భావిత** రైతులతో పలుమార్లు సమన్వయ సమా**వేశాలు** నిర్వహించి ఓ కొలిక్కి తీసుకువచ్చారు. ఇప్పటికే **పాత**నౌపడ, కస్పా నౌపడ, ఇజ్జువరం, రాజపురం గ్రామాల్లో రైతులకు పరిహారం చెల్లించేందుకు అవార్డు ప్రక్రియ సైతం పూర్తి చేశారు.

భూముల విలువకు అదనంగా..

పోర్టు అప్రోచ్ రోడ్డుకు గుర్తించిన భూములకు సంబంధించి వాస్తవంగా ఉన్న భూముల విలువకు అదనంగా విలువను నిర్ధారించారు. నోటిఫికేషన్‌కు మునుపు మూడేళ్ల పాటుగా ఈ ప్రాంతంలో జరిగిన భూముల క్రయవిక్రయాలకు అనుగుణంగా చట్టం ప్రకారం భూమి విలువను నిర్ధారించారు.

- టెక్కలి సమీపంలో మొత్తం 52.45 ఎకరాలను గుర్తించారు. ఈ భూములకు ప్రస్తుతం ఎకరాకు ఉన్న విలువ రూ.17,60,000. ప్రభుత్వం రూ.39,19,930 పరిహారం ఇచ్చేందుకు నిర్ణయించారు.
- తలగాం ప్రాంతంలో 39.59 ఎకరాలను గుర్తించారు. ఇక్కడ ఎకరాకు ఉన్న విలువ రూ.9,90,000. ప్రభుత్వం రైతులకు రూ.27,50,000 పరిహారం ఇచ్చేందుకు విలువను నిర్ణయించారు.
- బన్నువాడలో 19.27 ఎకరాలను గుర్తించారు. ఈ ప్రాంతంలో వాస్తవంగా ఎకరాకు రూ.9,90,000. ప్రభుత్వం ఎకరాకు రూ.19,47,538 పరిహారం ఇచ్చేందుకు నిర్ణయించారు.
- **వేములవాడలో 22.75 ఎకరాలను** గుర్తించారు. ఇక్కడ వాస్తవంగా ఎకరా రూ.9,90,000. ప్రభుత్వం మార్కెట్ విలువ అంచనాతో రైతులకు పరిహారంగా రూ.20,00,000 ఇచ్చేందుకు నిర్ణయించారు.
- మోదుగువలసలో 26.47 ఎకరాలను గుర్తించారు. ఈ ప్రాంతంలో ఎకరా రూ.9,90,000 ఉన్నట్లు గుర్తించారు. అయితే రైతులకు పరిహారం రూపంలో రూ.19,29,750 నిర్ణయించారు.
- పాతనౌపడలో 17.58 ఎకరాలను గుర్తించారు. ఇక్కడ వాస్తవంగా ఎకరా భూమి 9,90,000 ఉన్నట్లు గుర్తించారు. రైతులకు పరిహారం రూపంలో రూ.14,90,020 అందజేసేందుకు నిర్ణయించారు. ఈ భూములకు మరింత విలువను పెంచుతూ అదనంగా పరిహారం అందజేసేందుకు అవార్డు ప్రక్రియ చేపట్టారు.
- ఇజ్జువరంలో 13.77 ఎకరాలను గుర్తించారు. ఇక్కడ ఎకరా భూమి విలువ రూ.9,90,000 ఉన్నప్పటికీ రైతులకు పరిహారంగా రూ.25,16,718 ఇచ్చేందుకు నిర్ణయించారు. రైతుల అంగీకారం మేరకు ఇప్పటికే అవార్డు ప్రక్రియ పూర్తి చేశారు.
- రాజపురంలో 16.82 ఎకరాలను గుర్తించారు. ఈ ప్రాంతంలో ఎకరా భూమి రూ.9,90,000 ఉన్నప్పటికీ ప్రభుత్వం రూ.19,50,350 ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇక్కడ కూడా అవార్డు ప్రక్రియ పూర్తి చేశారు.
- కస్పానౌపడ గ్రామంలో 36.395 ఎకరాలను గుర్తించారు. ఇక్కడ ఎకరా భూమి విలువ రూ.9,90,000 ఉన్నప్పటికీ రైతులకు ప్రయోజనం కలిగేలా రూ.22,51,516 పరిహారం ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇక్కడ రైతుల అంగీకారం మేరకు అవార్డు ప్రక్రియ పూర్తి చేశారు.



కర్షక ప్రయోజనమే ధ్యేయం



మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుతో ఈ ప్రాంతం అభివృద్ధితో పాటు భూములు ఇస్తున్న రైతులకు ప్రయోజనం కలిగేలా పరిహారం అందజేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో చర్యలు చేపడుతోంది. పోర్టు రోడ్డు విషయంలో వాస్తవంగా ఉన్న భూముల విలువకు చట్టం ప్రకారం ధరను నిర్దేశిస్తూ జిల్లా అధికారుల సూచనలతో అదనంగా పరిహారం అందజేసేందుకు విలువను నిర్ధారించాం. పోర్టు నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించి భవిష్యత్ తరాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇచ్చే వారిగా చరిత్రలో నిలిచిపోవాలని ఆశిస్తున్నాం.

– టి.రాహుల్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్, టెక్కలి

ఆపదలో ఆదుకున్న దిశ

- యువకుడు బెదిరిస్తుండగా ఎస్‌ఓఎస్‌ను ఆశ్రయించిన యువతి
- క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు
- యువకుడిపై కేసు నమోదు
- కేవలం ఆరు నిమిషాల్లో 'ఆపరేషన్'



వేధించిన యువకుడు ధర్మారావు

పొందూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన దిశ చట్టం, ఎస్‌ఓఎస్ యాప్ సత్ఫలితాలనిస్తున్నాయి. తాజాగా పొందూరు మండలంలో బుధవారం జరిగిన ఘటనే ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. పొందూరు మండలంలో పనిచేస్తున్న ఉద్యోగినిని రణస్థలం మండలం కోటపాలెం సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎ.ధర్మారావు వేధింపులకు గురిచేశాడు. బైక్‌పై ఉద్యోగానికి వెళ్తున్న యువతిని రాపాక జంక్షన్ వద్ద అడ్డగించి బెదిరించాడు. వెంటనే అమ్మాయి ప్రాణభయంతో దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసి సహాయం కోరింది. దీంతో ఆరు నిమిషాల్లో సంఘటనా స్థలానికి దిశ పోలీసులు చేరుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని బాధితురాలికి భరోసా కల్పించారు. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై దిశ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 86 కేంద్రాల్లో తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ పేపర్లకు పరీక్షలు జరగ్గా 450 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్‌ఐఓ శ్రీకాకుళం నగరంలోని పలు కేంద్రాల్లో తనిఖీలు చేశారు. డీవీఈఓ కోట ప్రకాశరావు, డీఈసీ కమిటీ సభ్యులు, నాలుగు ఫ్లయింగ్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు వేరువేరుగా తనిఖీలు చేపట్టారు.

మూడు ఆలయాల్లో చోరీ

- శాలిహుండం కొండపై దొంగలు పడ్డారు
- సీసీ ఫుటేజీ పట్టుకెళ్లిన దుండగలు
- విలువైన ఆభరణాలు మాయం



శివాలయం వద్ద వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, కమిషనర్ సూర్యప్రకాశరావు

గార : మండలంలోని శాలిహుండం కొండపై వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు వేంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయాల్లో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. కొండపై రాత్రిపూట ఎవరూ ఉండకపోవడాన్ని గుర్తించిన దుండగులు తొలుత వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీని పగలగొట్టి నగదును దోచుకున్నారు. అనంతరం వేణుగోపాలస్వామి ఆలయంలోకి చొరబడి తులం బంగారం వస్తువులు, 80 తులాల వెండి ఆభరణాలు, శఠగోపం, వెండిపళ్లెం తదితర వస్తువులు పట్టుకుపోయారు. శివాలయంలోనూ వెండి వస్తువులు మాయమయ్యాయి. మూడు ఆలయాల్లోనూ హుండీలను పగలగొట్టి నగదు దోచుకున్నారు. అక్కడే ఉన్న ధర్మకర్త సుగ్గు మధురెడ్డి గృహంలోకి చొరబడి బీరువాను పగలగొట్టారు. సీసీ ఫుటేజీ ఉన్న సీపీయూను తీసుకెళ్లారు. బుధవారం ఉదయం అర్చకులు దేవాలయానికి వెళ్లగా తలుపులు తెరచి ఉండటంతో ధర్మకర్త మధురెడ్డికి, పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్ హరిసూర్యప్రకాశరావు ఆలయానికి చేరుకుని చోరీ ఘటనపై ఆరా తీశారు. శ్రీకాకుళం నుంచి క్లూస్‌టీం వివరాలు సేకరించారు. సమీప సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఏఎస్సై లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండలంలో ఇటీవల దొంగతనాలు జరుగుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

గురువుల బదిలీలకు శ్రీకారం

- రెండేళ్ల వ్యవధిలో మరోసారి ట్రాన్స్‌ఫర్లకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఇప్పటికే ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- 25 నుంచి దరఖాస్తుల పరిశీలన
- జూన్ 2, 3 తేదీల్లో తుది జాబితాలు



పాఠాల బోధనలో ఓ టీచర్

శ్రీకాకుళం న్యూకాలనీ: గురువుల బదిలీలకు వేళయింది. రెండేళ్ల వ్యవధిలో రెండోసారి ఉపాధ్యాయుల ట్రాన్స్‌ఫర్లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇప్పటికే మార్గదర్శకాల వెలువడి షెడ్యూల్ కూడా ప్రకటించడంతో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, టీచర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. స్వీయ ధ్రువీకరణ చేసిన వాటిని మాత్రమే ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

వెబ్‌ఆప్షన్స్‌కు చాన్స్..

హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు జూన్ 5 నుంచి 8వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందులో హెచ్‌ఎంలకు 5 నుంచి ఆరో తేదీ వరకు అవకాశం కల్పించగా.. స్కూలు అసిస్టెంట్లకు 5 నుంచి 7వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఇక సెకండరీ గ్రేడ్ టీచర్లకు జూన్ 5 నుంచి 8 వరకు ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. జూన్ 9న ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్లలో బదిలీలు అయిన వారి జాబితాలను విడుదల చేయనున్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల జాబితాలను 9 నుంచి 11 వరకు విడుదల చేసేలా మార్గదర్శకాలు వెలువరించింది.

ఆధారాలు చూపించాల్సిందే..!

బదిలీలు అయ్యేవారు ప్రిఫరెన్షియల్ కేటగిరిలో ఉన్నట్టయితే అటువంటి వారు ఆధారాలను పరిశీలనకు ముందు ధ్రువీకరణ పత్రాలు అందించాల్సి ఉంటుందని విద్యా శాఖాధికారులు పేర్కొన్నారు. మెడికల్‌కు సంబంధించి రిమ్స్ మెడికల్ హాస్పటల్ బోర్డు ధ్రువీకరించాల్సి ఉంటుంది. స్పౌజ్‌కు సంబంధిత పాఠశాల హెచ్‌ఎం ధ్రువీకరణ చేయాలి. ఆన్‌లైన్‌లో ఇప్పటివరకు 950 మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. జీవో సర్వీస్‌కు కూడా రిక్వెస్ట్ బదిలీ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సూచిస్తున్నారు.

బదిలీల షెడ్యూల్ ఇదీ..

- ఈ నెల 24 నుంచి 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.
- ఆన్‌లైన్లో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 25 నుంచి 27 వరకు పరిశీలించనున్నారు.
- ఈ నెల 28, 29 తేదీల్లో ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాలను ప్రదర్శిస్తారు.
- జాబితాలో పొరపాట్లు, తప్పులుంటే ఉపాధ్యాయులు అభ్యంతరాలు చేసుకునేందుకు 30న అవకాశం కల్పించారు.
- ఈ నెల 31, జూన్ 1 తేదీల్లో అభ్యంతరాలు పరిష్కరిస్తారు
- జూన్ 2, 3వ తేదీల్లో టీచర్లకు పాయింట్లను బట్టి వెబ్‌సైట్‌లో తుది సీనియార్టీ జాబితాలను ఉంచుతారు.
- జూన్ 4న ఖాళీలు ప్రదర్శించనున్నారు.



44,301 మంది తల్లుల ఖాతాల్లో రూ.36.73 కోట్లు జమ



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

- జిల్లాలో జగనన్న విద్యాదీవెన కింద 49,165 మంది విద్యార్థులకు లబ్ధి
- చెక్కు పంపిణీలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వెల్లడి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న విద్యా దీవెన కింద జిల్లాలో 44,301 మంది తల్లుల ఖాతాల్లో రూ.36.73 కోట్లు జమ అయ్యాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వెల్లడించారు. 2022– 23 ఏడాదికి సంబంధించి రెండో విడత జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొని నమూనా చెక్కును విద్యార్థులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజులను త్రైమాసికం ముగిసిన వెంటనే తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ పలు అభివృద్ధి పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యార్థులు ద్రాక్షాయని, ఉదయ్, కల్యాణి, స్రవంతి, పవిత్రా మాట్లాడుతూ చదువుకోవాలనే ఆసక్తి ఉండి ఆర్థిక స్థోమత లేకపోయిన వారికి విద్యాదీవెన వంటి పథకాలు ఆసరాగా నిలుస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బల్లాడ హేమమాలిని రెడ్డి, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, రాజాపు హైమావతి, సాంఘిక సంక్షేమ శాఖ (ఎఫ్.ఏ.సి) అధికారి గడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫార్మా పరిశ్రమలో ఉద్యోగాలకు శిక్షణ



మాట్లాడుతున్న యు.ఎస్.బి.రాజు

రణస్థలం: ఫార్మా పరిశ్రమలో ఉద్యోగాలు పొందేందుకు ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులకు ఉచితంగా నాలుగు నెలలు శిక్షణ ఇస్తున్నామని అరబిందో కార్పొరేట్ హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యు.ఎస్.బి.రాజు తెలిపారు. రణస్థలం మండలంలోని వరిసాం సమీపంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న ఎనిమిదో బ్యాచ్‌కు చెందిన 40 మంది విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ సర్టిఫికెట్లను బుధవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెస్సీ చదివి ఎంపిక కాబడిన విద్యార్థులకు ఫార్మాసిటికాల్ క్వాలిటీ కంట్రోల్ అనలైటికల్ టెక్నిక్స్ శిక్షణను నాలుగు నెలలు పాటు ఇవ్వడం జరిగిందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే, అధునాతన యంత్రాలతో ఫార్మా, కెమికల్స్‌కు అవసరమైన శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో యూనిట్ హెచ్ఆర్ హెడ్ కమలాకర్ రెడ్డి ఉన్నారు.

కల్యాణం..కమనీయం



ఎండల మల్లికార్జునస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

టెక్కలి: మండలంలోని రావివలసలో బుధవారం ఎండల మల్లికార్జునస్వామి వార్షిక కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.వి.ఎస్.నారాయణ నేతృత్వంలో అర్చకులు రామకృష్ణ, యుగంధర్, వేద పండితులు ఆధ్వర్యంలో ముందుగా ఉత్సవమూర్తులతో తిరువీధి నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.బాలకృష్ణ, ఆలయ మాజీ కమిటీ చైర్మన్ ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారం చేసే దిశగా ఆలోచన చేయాలని ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి అన్నారు. ఉపాధ్యాయ, కార్మిక, పింఛన్‌దారులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయం వద్ద బుధవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తమ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందన్నారు. ఇటీవల రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈనెల ఐదో తేదీన సమ్మె నోటీసు అందజేసినట్టు చెప్పారు. సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కారిమి రాజేశ్వరరావు, కూన వెంకట సత్యనారాయణ, రామారావు, కిల్లారి నారాయణరావు, జయమ్మ పాల్గొన్నారు.

31న మణినాగేశ్వరస్వామి కల్యాణ ఉత్సవం

శ్రీకాకుళం రూరల్: కళ్లేపల్లి గ్రామంలో వెలసిన గౌరీ సమేత మణి నాగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను ఈనెల 31న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి సూర్యనారాయణమూర్తి, కార్యనిర్వాహణాధికారి పొన్నాడ శ్యామలరావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నదానం, సాయంత్రం ఐదు గంటలకు కల్యాణ మూర్తుల తిరువీధి ఉంటుందన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,360–00
బంగారం(22సి. 10గ్రా.)	56,250–00
వెండి (కిలో)	77,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 485.00
శ్రీకాకుళం	రూ. 485.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

సంబరం ఆరంభం



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత నీలమణిదుర్గ అమ్మవారి పెద్ద పండుగల్లో ప్రధాన సంబరం బుధవారం ప్రారంభమైంది. పట్టాజంగిడతో అమ్మవారిని ఊర్లోకి ఆహ్వానించే మహోత్సవం అట్టహాసంగా జరిగింది. పిన్నింటి కుటుంబ సభ్యులు పట్టాజంగిడెను పట్టుకొని అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. –పాతపట్నం



ఆకట్టుకున్న దుర్గా వేషధారణలు



థింసా నృత్యం చేస్తున్న మహిళలు

సాఫ్ట్‌బాల్ జట్లు పయనం



క్రీడాకారులతో అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ కడప జిల్లాలోని సునందపల్లిలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలురు, బాలికల జట్లు బుధవారం పయనమై వెళ్లాయి. పది రోజులగా కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహించి, క్రీడాకారులకు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. జట్టుకు 16 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులన సంఘ ప్రతినిధులు అభినందించారు. జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదండి వెంకట రామరాజు మాట్లాడుతూ.. ఉత్తమ ప్రతిభ కనబర్చి విజయంతో రావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు స్పోర్ట్సు దుస్తులను ఏపీజీవీబీ మేనేజర్ పూజారి వెంకటేష్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు సూర జగదీశ్వరరావు, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతి రావు, కోచింగ్ శిబిరం ఇన్‌చార్జి మొజ్జాడ వెంకటరమణ, పీడీ గొంటి మల్లేష్ పాల్గొన్నారు.

ఐరిష్ పరికరాల పంపిణీ



ఐరిష్ పరికరాలను అందజేస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: లబ్ధిదారులకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం అన్నిచర్యలు తీసకుంటుందని జేసీ నవీన్ అన్నారు. ఇందులో భాగంగా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే కొందరికి వేలిముద్రలు పడకపోవడంతో రేషన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. దీంతో అలాంటి వారి కోసం ఐరిష్ పరికరాలను సిద్ధం చేసింది. వీటిని ఎండీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు మంచి సేవలు అందిస్తున్నారని, ఇంకా మెరుగైన సేవలందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలకు ఈ మిషన్లను అధికారుల ద్వారా అందజేస్తామన్నారు. వేలిముద్రలు పడనివారికి ఐరిష్ ఆధారిత ఆధార్ ధ్రువీకరణ ద్వారా రేషన్ సరుకులు ఇవ్వాలని సూచించారు. గురువారం నుంచి ఐరిష్ మిషన్లను జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్‌వో రమణ, విజన్ టెక్నీషియన్ శ్రీనివాస్ ఉన్నారు.

బస్సులో బంగారం గొలుసు చోరీ



తనిఖీలు చేస్తున్న పోలీసులు

రణస్థలం: బస్సులోనే మూడు తులాల బంగారం గొలుసును చోరీ చేసిన ఘటన ఇది. విజయనగరం నుంచి శ్రీకాకుళం వస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న గురుగుబెల్లి అనిత మెడలో మూడు తులాల బంగారం గొలుసు చోరీకి గురైందని ఫిర్యాదు అందిందని జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. ఎచ్చెర్ల మండలం ఇబ్రంహీంబాద్ గ్రామానికి చెందిన అనితతో సహా మరో ముగ్గురు విజయనగరంలోని బంధువుల ఇంటిలో జరిగిన వారాలకు బుధవారం ఉదయం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో విజయనగరం నుంచి వస్తున్నప్పుడు గుర్తు తెలియని మహిళ అనిత మెడలో నుంచి గొలుసును చాకచక్యంగా చోరీ చేసింది. అయితే ఈ విషయాన్ని ఆమె పూసపాటిరేగ మండలంలోని కందివలస వచ్చిన తరువాత గమనించింది. వెంటనే 100కు ఫోన్ చేయడంతో జె.ఆర్.పురం పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో రణస్థలంలో బస్సు ఆపి మహిళా పోలీసులు తనిఖీలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చోరీకి పాల్పడినట్టుగా భావిస్తున్న మహిళ కందివలసలో దిగిపోయిందని బస్సులో ఉన్న ప్రయాణికులు తెలిపారు. దీనిపై జె.ఆర్.పురం ఎస్సై రాజేష్ మాట్లాడుతూ.. విజయనగరం, పూసపాటిరేగ సమీపంలో చోరీ జరిగిందని, ఫిర్యాదు స్వీకరించి రెండు పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చి ర్యాప్తు చేస్తామని చెప్పారు.

వలలో చిక్కిన అలుగు





అలుగును అటవీశాఖ అధికారులు రాఘవయ్య, రవికుమార్‌లకు అందజేసిన గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో) వలలో చిక్కిన అలుగు

కవిటి: ముత్యాలపేటలో కొబ్బరి తోటకు రైతులు రక్షణ కంచెగా అమర్చిన వలలో ఓ అలుగు చిక్కింది. దీంతో రైతుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న అటవీ అధికారులు అలుగును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం ఉదయం దినచర్యలో భాగంగా కొబ్బరితోట వైపు వెళ్లిన రైతు పి.రామస్వామి, మనవరాలు రాజేశ్వరీలకు వలలో చిక్కుకొని ఉన్న అలుగు కనిపించింది. దీంతో అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ రాఘువయ్య, బీట్ ఆఫీసర్ రవి కుమార్ చేరుకున్నారు. కవిటి పశుసంవర్ధకశాఖ సిబ్బందికి సమాచారం అందించి తక్షణ వైద్యపరీక్షలు చేయించారు. స్థానిక పంచాయతీ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో నివేదిక రాసుకున్నారు. స్వాధీనం చేసుకున్న అలుగును అటవీ ప్రాంతంలో విడిచి పెడతామని అధికారులు తెలిపారు.

గాలివాన బీభత్సం

- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు
- నేలరాలిన మామిడి కాయలు



ఎల్.ఎన్.పేట: తురకపేట సమీపంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

ఎల్.ఎన్.పేట : జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఎల్.ఎన్.పేట మండలంలో ఈదుర గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ చెట్లు పడిపోవటంతో పాటు కొమ్మలు విరిగిపోయాయి. సుమారు అరగంట పాటు కుండపోతగా వర్షం కురిసింది. మండల కేంద్రంలో రేకుల షెడ్లు ఎగిరి పడ్డాయి. ఇటుకల తయారీదారులకు, మామిడి తోటల రైతులకు అపార నష్టం కలిగింది. పంట చేతికి అందివచ్చే సమయంలో కాయలు రాలిపోవటంతో నష్టం తప్పలేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తురకపేట రోడ్డులో ఈదుర గాలుల ధాటికి ఆటో ఆదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ ఒక్కరే ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

- ఆమదాలవలస రూరల్: ఈదురుగాలుల ధాటికి సైలాడ, కుమ్మరిపేట గ్రామాల్లో రెండు విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ సిబ్బందితో వెళ్లి సరఫరా పునరుద్ధరించారు.



ఎల్.ఎన్.పేట: తురకపేటలో ఎగిరిపడిన రేకుల ఇళ్లు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన జీవితేశ్వరరావు

సారవకోట: కురిడింగి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అర్లి గ్రామానికి చెందిన సింహాద్రి జీవితేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. అర్లి గ్రామం నుంచి బొంతు వైపు ద్విచక్ర వాహనంపై జీవితేశ్వరరావు వెళ్తుండగా కురిడింగి సమీపం అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన ఆయన్ని 108 వాహనంలో శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

- నగం కాలిన శవం
- పోలీసుల దర్యాప్తు ప్రారంభం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కృష్ణ

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ శివారు శ్రీహరిపురం గ్రామం సమీపంలో సుందరరావు రైస్ మిల్లు వద్ద ఏబీ రోడ్డు పక్కన గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమయింది. ఆమదాలవలస ఎస్సై వై.కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పారిశుద్ధ్య కార్మికులు బుధవారం ఉదయాన్నే ఆ ప్రాంతంలోనిల చెత్తను తరలిస్తుండగా ఆదే సమయంలో సగం కాలిపోయిన మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి ఎస్సై తన సిబ్బందితో చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం మృతుడు వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, వారం రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. సగం కాలిన మృతదేహాన్ని రోడ్డు పక్కన పడేసినట్లు ఆనవాళ్లు గుర్తించారు. సైలాడ సచివాలయ వీఆర్వో సంతోష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కాగా మృతదేహంపై పలు సందేహాలు వెల్లువెత్తున్నాయి. ఇటీవల కాలంలో పట్టణంలోని పార్వతీశునిపేట వద్ద భూముల లావాదేవీలపై అక్కడే ఉన్న దాబాల వద్ద చర్చలు జరిగాయి. భూ వివాదాల కారణంగా దాబాలకు సమీపంలోనే మృతదేహం గుర్తించడం కలకలం రేగుతుంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘం నాయకుల విజ్ఞప్తి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

కాశీబుగ్గ: జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు కోరారు. 80 కిలోల బస్తాకు రూ.16 వేలుగా నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పలాసలోని వేదిక మినీ హాల్‌లో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో జీడి పంట సాగు చేస్తున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో లక్ష ఎకరాల్లో జీడి పంట సాగు చేస్తుండగా దీనిపై 80 వేల మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కేరళ రాష్ట్రం మాదిరిగా జీడి బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జీడిని పండించిన రైతు, కొనుగోలు చేసిన వినియోగదారుడు నష్టపోతుండగా..వ్యాపారి మాత్రం లాభ పడుతున్నారన్నారు. రైతులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, పొరహక్కుల సంఘం నాయకుడు పిండి వెంకటరావు, రైతాంగ సాధన కమిటీ నాయకులు నల్ల హడ్డి, కె.హేమారావు చౌదరి, వంకల మాధవరావు, జి.బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, హేమావతి, గణపతి, సింహాద్రి, బత్తిని ఒంకారం, వినోద్‌కుమార్, బాష్కరరావు, అప్పలస్వామి, వాసుదేవరావు, పురుషోత్తం , ఆనందరావు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న గీతం డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్. రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఎస్‌బీఐ కార్డ్స్, అపోలో ఫార్మసీ, సోలేరా, బిగ్ బాస్కెట్, సీఈటీసీటీ సోలార్ ఎనర్జీ, ఏటూబీ, జయభేరి, నవతా ట్రాన్స్‌పోర్ట్, మెడిప్లస్, బొల్లినేని మెడ్ స్కిల్స్ (జెమ్స్) వంటి సంస్థల్లో ఖాళీలను అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయనున్నట్టు చెప్పారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు వారి బయోడేటాతోపాటు డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 95051 50287, 70136 08073 సంప్రదించాలన్నారు.

అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తా

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మాట్లాడుతున్న కే ఏ పాల్

రణస్థలం: రానున్న 2024 ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లోనూ పోటీ చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కే.ఏ.పాల్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడిభీమవరంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పాల్ మాట్లాడుతూ పైడిభీమవరం పారిశ్రామికవాడలో కాలుష్యం ఎక్కువగా ఉందన్నారు. అభివృద్ధి, తాగు నీటి సౌకర్యాలు లేవన్నారు. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం లేదన్నారు. ఇప్పుడు మీడియా ద్వారా పరిశ్రమల యాజమాన్యాలకు ఒకటే చెబుతున్నానని, 30 రోజుల్లోగా అభివృద్ధి విషయమై సమాధానం చెప్పకపోతే హైకోర్టులో అపీల్ చేస్తానని అన్నారు. లేదంటే 72 గంటల్లో హైదరాబాద్ వచ్చి నన్ను కలవాలన్నారు. 'పవన్ కల్యాణ్ తమ్ముడూ రా.. నిన్ను ముఖ్యమంత్రిని చేస్తానని గతంలో చెబితే వద్దు లోకేష్‌నే ముఖ్యమంత్రి చేస్తానని అన్నావు. జగన్‌ను ఓడించడం, చంద్రబాబును గెలిపించడమే నాలక్ష్యం అన్నావు.. ఓకే నువ్వు వెళ్లి గెలిపించుకో.. కాపులందరూ.. బీసీలందరూ ప్రజాశాంతి పార్టీలో చేరిపోతున్నారు. బుర్రున్నోళ్లు ప్రజాశాంతి పార్టీలో చేరుతారని పాల్ చెప్పారు.

టెన్త్ టాపర్ బాలవర్ధన్‌కు సన్మానం



అవార్డును అందుకుంటున్న బాలవర్ధన్

మందస: కుంటికోట గ్రామానికి చెందిన మానిమి బాలవర్ధన్ పదో తరగతిలో 583 మార్కులు సాధించాడు. ఈయన మహాత్మా జ్యోతిబాపూలే మత్స్యకార గురుకుల పాఠశాలలో చదివాడు. అధిక మార్కులు సాధించడంతో ఈ విద్యార్థిని రాష్ట్ర ప్రభుత్వం సన్మానించింది. ప్రభుత్వ విద్యాసంస్థలో చదువుతూ మంచి మార్కులు తెచ్చిన బాలవర్ధన్ విజయవాడలోని తుమ్మలపల్లి క్షత్రియ కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అవార్డు అందజేసి సన్మానించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, మహాత్మా జ్యోతిబాపూలే మత్స్యకార గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ అనంతరాం, సెక్రటరీ కృష్ణమోహన్‌రావు చేతుల మీదుగా బాలవర్ధన్ మెమెంటోను అందుకున్నాడు.

అర్జీలు రీఓపెన్ కారాదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్నకు చెబుదాం(స్పందన)లో వచ్చిన అర్జీలు రీఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో స్పందన రీఓపెన్ అర్జీలపై సంబంధిత అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కరించకపోవడం, ఇచ్చిన సమాధానంతో సంతృప్తిపడకపోవడం వల్లే అర్జీలు రీఓపెన్ అవుతాయన్న సంగతిని గుర్తించాలన్నారు. ఇకపై ఇటువంటివి పునరావృతం కారాదని, సరైన సమాధానం ఇవ్వకుండా ఫైలు ముగించాలని చూస్తే అటువంటి అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాకే చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందనకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, అంతే ప్రాధాన్యతతో ఫిర్యాదులు పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవి కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్.వెంకటరామన్, డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకుడు ఎన్.గణపతిరావు, జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్.శంకర్‌నాయక్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ ఎం.కిషోర్, స్పందన విభాగం పర్యవేక్షకుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.